క్లుప్తంగా

సైబర్ నేరాలపై అవగాహన

కోడేర్, తెలకపల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో సైబర్ నేరాలపై గ్రామస్తులకు ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పవద్దన్నారు. అపరిచిత వ్యక్తులతో సోషల్ మీడియాలో స్నేహం చేయరాదన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

మన్ననూర్: జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని దోమలపెంట ప్రాజెక్టు ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులను గ్రూపులుగా ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రమంలో అన్ని రకాల సబ్జెక్టులను కలుపుకొని నిర్వహించిన క్విజ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్టెల్లా, శ్రీధర్, శంకర్, ఈశ్వర్, మల్లయ్య, శిరీష పాల్గొన్నారు.

వసతులు కల్పించాలి

ఉప్పునుంతల: ఎండలు తీవ్రమవుతున్నందున జాతీయ ఉపాధి పనుల వద్ద కూలీలకు నీడ, తాగునీటి వంటి మౌలిక వసతులు తప్పనిసరిగా కల్పించాలని ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని పెద్దాపూర్ శివారులో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మస్టర్ కాపీలను తనిఖీ చేశారు. ఎంపీడీఓ పాటు ఈజీఎస్ ఏపీఓ సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎంపీడీఓగా బాధ్యతలు

వెల్దండ: భద్రాది కొత్తగూడం జిల్లా పినపాక ఎంపీడీఓగా పనిచేస్తున్న శ్రీనివాసులు బదిలీపై బుధవారం వెల్దండ మండల ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టారు. దాదాపుగా 6 నెలలుగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా మండలంలో అభివృద్ధి పనులు చేశారు. నూతన ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టడంతో మండల ప్రజల సమస్యలు తీరనున్నాయి. ఎంపీడీఓ శ్రీనివాసులును ఏపీఓ ఈశ్వర్, సిబ్బంది ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు.

మంత్రిని కలిసిన సర్పంచ్

వెల్దండ: రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి సత్యవతి రాథోడ్‌ను బుధవారం హైదరాబాద్‌లో వెల్దండ మండలం నారాయణపూర్ సర్పంచ్ అంజినాయక్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిజన అభివృద్ధికి సహాయ సహకారం అందించాలని కోరినట్లు పేర్కొన్నారు. నూతనంగా గ్రామ పంచాయతీ ఏర్పాటైందని, గిరిజన భవన నిర్మాణానికి కృషి చేయాలని కోరుతూ వినతి అందజేసినట్లు పేర్కొన్నారు. శ్రీనునాయక్, నరేష్‌నాయక్, సురేందర్ తదితరులు ఉన్నారు.

రీజియన్ ఉత్తమ క్లబ్‌గా కల్వకుర్తి



కల్వకుర్తిరూరల్: లయన్స్ రీజియన్ సమావేశం మంగళవారం ఘనంగా నిర్వహించారు. రీజియన్ పరిధిలోని 13 క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు ఈ సమావేశంలో పాల్గొని ఇప్పటివరకు వారు చేసిన కార్యక్రమాలను సమావేశంలో ప్రదర్శించారు. రీజియన్ పరిధిలో కల్వకుర్తి లయన్స్‌క్లబ్‌కు ఉత్తమ క్లబ్, ఉత్తమ ప్రెసిడెంట్, ఉత్తమ కార్యదర్శి, ఉత్తమ కోశాధికారి అవార్డులు లభించాయి. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ వెంకటేష్ క్లబ్ సభ్యులను అభినందించారు. కలిమిచర్ల రమేష్, శ్రీధర్, వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి

కల్వకుర్తి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంట్స్‌లో కనీస వేతనాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని లేబర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ సప్తగిరికి వినతి అందజేశారు. కాంట్రాక్ట్ కార్మికులు అంతర్రాష్ట్ర వలస కార్మికులకు కార్మిక చట్టాలు అమలు చేయాలనే డిమాండ్‌తో మార్చి 26న చలో లేబర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు శ్రీనివాసులు తెలియజేశారు. ఆంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫ్యాన్ల వితరణ

కల్వకుర్తి రూరల్: మండలంలోని పంజుగులలోని సబ్‌సెంటర్‌కు గ్రామానికి చెందిన దారమోని గణేష్ రెండు ఫ్యాన్లను అందజేశారు. ఆరోగ్య సిబ్బంది ఇబ్బందులను గుర్తించి తమ వంతు సహకారం అందించామని చెప్పారు.

పెద్దాపూర్‌లో కంటివెలుగు శిబిరం

ఉప్పునుంతల: మండలంలోని పెద్దాపూర్‌లో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీటీసీ కవిత, పీఏసీఎస్ డైరెక్టర్ రవీందర్‌రావు ప్రారంభించారు. గ్రామంలోని ప్రజలందరూ కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటిచూపు మందగించిన వారికి కంటి అద్దాలు ఉచితంగా అందజేయడంతో పాటు అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తారని చెప్పారు.

అల్లాపూర్.. అభివృద్ధిలో ఆదర్శం

తాడూరు: మండలంలోని అల్లాపూర్ గ్రామాన్ని జాతీయ అవార్డు కోసం అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. బుధవారం డీపీఓ కృష్ణ, సీఈఓ ఉష గ్రామాన్ని సందర్శించి గ్రామంలో అభివృద్ధి పనులకు సంబంధించి ఫొటోలను చిత్రీకరించారు. ఉత్తమ జాయింట్ ఫ్రెండ్లీ పంచాయతీగా జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి వెళ్లిందని ఎంపీడీఓ గంగామోహన్ తెలియజేశారు. అక్కడి నుంచి జాతీయ స్థాయిలో పరిశీలించిన అనంతరం అధికారులు తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నారు. గ్రామంలో ఎక్కడా లేని విధంగా 100కు పైగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారన్నారు. సర్పంచ్ నిరంజన్ ప్రత్యేక చొరవ కారణంగా పాఠశాలలో కార్పొరేట్ స్థాయికి దీటుగా మూత్రశాలల నిర్వహణ, పాఠశాలలో పచ్చని చెట్లు అదేవిధంగా అంగన్‌వాడీ భవనం సుందరీకరణ, ఆవరణలో న్యూట్రీ గార్డెన్ ఏర్పాటు, రైతువేదిక, డంపింగ్ యార్డు, నూతన గ్రామపంచాయతీ నిర్మాణం, గ్రామస్తుల విరాళాలతో సుందరంగా నిర్మించుకున్న ఆంజనేయ స్వామి ఆలయం అభివృద్ధికి ఆదర్శంగా నిలిచాయన్నారు.



అంగన్‌వాడీ ఆవరణలో ఆట వస్తువులను పరిశీలిస్తున్న సీఈఓ, డీపీఓ



పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత



సుందరంగా నిర్మించిన ఆలయం

అందరి సహకారంతో అభివృద్ధి..



తాను సర్పంచ్‌గా గెలిచిన అనంతరం దాదాపు 100 ఇంకుడుగుంతలు నిర్మించాను. పల్లెప్రగతిలో భాగంగా తాను అప్పులపాలు అయినప్పటికీ అభివృద్ధి పనులను పూర్తి చేశాను. అందరి సహకారంతో ఎన్నో ఏళ్ల నుంచి పెండింగ్‌లోని ఆంజనేయస్వామి ఆలయం నిర్మించడంతో పాటు ప్రతిష్ఠాపన కార్యక్రమం చేపట్టా. వార్డు సభ్యులు, ఉపసర్పంచ్ సహకారంతో ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రతి అభివృద్ధి పనిని చేపట్టాం.

– గుంటి నిరంజన్, సర్పంచ్, అల్లాపూర్

భక్తిశ్రద్ధలతో పూజలు

తెలకపల్లి: మండల కేంద్రంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో సీతారామ ఆంజనేయ స్వామి మల్లికార్జున శివాలయం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేదపండితులు శ్రీకాంత్‌శర్మ బృందంతో పాటు భక్తులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే...

నాగర్‌కర్నూల్ క్రైం: మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధిచేసేందుకు తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపాల్టీ పరిధిలోని ఎండబెట్లలో ఆంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కల్పన పాల్గొన్నారు.



ఎండబెట్లలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

వైద్య విద్యార్థినికి ఘన నివాళి



అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీవాసులు బుధవారం రాత్రి వైద్య విద్యార్థిని ప్రీతికి ఘన నివాళి అర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ప్రీతి చిత్రపటం వద్ద పూలు చల్లి మౌనం పాటించారు. కాలనీవాసులు, మహిళలు, ఉద్యోగులు, యువకులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం విస్మరించిన ప్రభుత్వం



తాడూరులో మాట్లాడుతున్న కొండనాగేష్

తాడూరు: టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందని నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ కొండ నాగేష్ విమర్శించారు. బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా మండలంలోని యాదిరెడ్డిపల్లిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ చెప్పిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల హామీ ఏ గ్రామంలో అమలుకు నోచుకోలేదన్నారు. నిరుద్యోగ భృతి, ఎన్నికల్లో ఇచ్చిన రుణమాఫీ, దళితులకు మూడెకరాల భూమి అమలు కాలేదన్నారు. బీజేపీ నాయకులు రోహిత్‌రెడ్డి, రాము, వెంకటనారాయణ, శ్రీనివాస్, సాదిక్‌పాషా పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల పరిధిలోని గౌరారం గ్రామంలో మంగళవారం రాత్రి బీజేపీ బూత్ 177, 178 ప్రజాఘోష బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి హాజరై మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. నరేంద్రాచారి, బాబుసాగర్, అంజిరెడ్డి, భీమయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

కల్వకుర్తి రూరల్: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడమే యూటీఎఫ్ ధ్యేయమని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ శర్మ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మాణిక్‌రెడ్డికి మద్దతుగా బుధవారం పట్టణంలోని పలు కాలనీల్లో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుల ఇళ్లతో పాటు కల్వకుర్తి, ఊరుకొండ, చారకొండ మండలాల పరిధిలోని పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి మాణిక్‌రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో చిన్నయ్య, బాలరాజు, మల్లయ్య, నెహ్రూప్రసాద్, పాండయ్య పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ప్రచారం

తెలకపల్లి: పీఆర్‌టీయూ సంఘ సభ్యులు బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రం, ఆలేరు, పెద్దూరు, పెద్దపల్లి, గడ్డంపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో మాట్లాడారు. గుర్రం చెన్నకేశవరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బిక్షనాయక్, మల్లికార్జున్, సూర్య, శ్రీనివాసులుగౌడ్ పాల్గొన్నారు.

అరాచక పాలనను తరిమికొట్టాలి

వెల్దండ: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని పీసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కంటోనిపల్లిలో నిర్వహించిన హాథ్‌సేహాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింట తిరుగుతూ ప్రజలను కలిశారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ఇష్టానుసారంగా పాలన సాగిస్తుండటంతో రైతులు, ప్రజలు, ఉద్యోగులు విసుగుచెందుతున్నారని ఆరోపించారు. ఏళ్లు గడుస్తున్నా.. రుణమాఫీ చేయడం లేదని, కొత్త రుణాలు అందక రైతులకు కష్టాలు తప్పడంలేదన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి లేక అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హాథ్‌సేహాథ్ జోడో యాత్రతో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందన్నారు.



కంటోనిపల్లిలో పాల్గొన్న వంశీచంద్‌రెడ్డి

మండలంలోని పెద్దాపూర్‌కి చెందిన కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో, బెల్లే హరీష్ విద్యుత్ షాక్‌తో ప్రమాదానికి గురయ్యాడు. మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి బాధితులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ప్రమాదానికి గురైన హరీష్‌కు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. విజయ్‌కుమార్‌రెడ్డి, మోతిలాల్‌నాయక్, వెంకటయ్యగౌడ్ పాల్గొన్నారు.

‘పోలీస్‌స్టేషన్ ముట్టడిస్తాం’

కోడేరు: ఎస్‌ఐపై చర్యలు తీసుకోకుంటే పోలీస్‌స్టేషన్‌ను ముట్టడిస్తామని కేవీపీఎస్ జిల్లా నాయకులు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సింగాయిపల్లిలో కేవీపీఎస్ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నర్సింహ రైతుల విషయంపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే ఎస్‌ఐ దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. వెంటనే ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని, లేకుంటే పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. శ్రీను, రమేష్, చంద్రశేఖర్, తిరుపతయ్య, రాముడు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి



అచ్చంపేటలో నివాళి అర్పిస్తున్న నాయకులు

అచ్చంపేట రూరల్: మాదిగ అమరవీరుల ఆశయ సాధనకు పోరాటం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సొట కాశీం కోరారు. బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మాదిగ అమరవీరులకు నివాళి అర్పించారు. రాంప్రసాద్, ప్రవీణ్, మహేష్, జగదీష్, అఖిలాష్, రాహుల్, శివ, చరణ్, క్రాంతి పాల్గొన్నారు.

కొల్లాపూర్: ఎస్సీ వర్గీకరణ సాధన ఉద్యమంలో అసువులు బాసిన మాదిగ అమరులకు ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళి అర్పించారు. కొల్లాపూర్ పట్టణంలోని బాబూ జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో మాదిగ అమరవీరుల చిత్రపటాలకు ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివమాదిగ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చి 9 సంవత్సరాలు అవుతున్నా ఇప్పటికీ వర్గీకరణ అంశాన్ని పట్టించుకోవడం లేదన్నారు. వర్గీకరణ అంశంలో మాదిగలను మోసం చేస్తున్న బీజేపీకి తగిన బుద్ధి చెబుతామన్నారు. సంపంగి మద్దిలేటి, పుట్టపాగ రాము, బచ్చలకూర లక్ష్మణ్, సహదేవుడు, బాలు, రాము, కురుమయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం అధికారులు సహకరించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం అధికారులు స్పందించాలని ఎంపీపీ నరసింహారెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాలలో మంచి నీటి సమస్య తలెత్తకుండ అధికారులు సహకరించాలని అధికారులకు ఎంపీపీ సూచించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు మండల సర్వసభ్య సమావేశంలో శాఖ పరమైన అంశాలపై చర్చించారు. కోటేశ్వర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లపై ప్రభుత్వం వివక్ష

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్రంలోని ఐసీడీఎస్ కార్యకర్తలపై ప్రభుత్వం వివక్ష చూపుతుందని, ప్రభుత్వం దిగివచ్చి సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామయ్య డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా నిర్వహించారు. కొంపల్లి అశోక్, చంద్రకళ, అశోక్, సుచిత్ర పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ ఉద్యోగులు సీఐటీయూ అనుబంధం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మల్లేష్, పద్మ, గంగమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

కల్వకుర్తి రూరల్: సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. జయమ్మ, శివరాములు, బాల్‌రెడ్డి, బాలస్వామి, జానకి, మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్: అంగన్‌వాడీ వర్కర్లకు 30 శాతం పీఆర్‌సీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం కొల్లాపూర్‌లో అంగన్‌వాడీ వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడారు. నీరజ, సాయిలీల, నిర్మల, వరలక్ష్మి పాల్గొన్నారు.



కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఐసీడీఎస్ కార్యకర్తలు

బల్మూర్: అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనాలు రూ.26 వేల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం స్థానిక సీడీపీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శంకర్‌నాయక్, మంజుల పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతి ప్రదానం

కల్వకుర్తి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలకల ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. 141 మంది విద్యార్థులు సైన్స్ దినోత్సవంలో పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రతిఒక్క విద్యార్థినికి క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో బహుమతి అందజేశారు. రాఘవేందర్, కోశాధికారి రాజేందర్, శోభన్‌బాబు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో మరింత అభివృద్ధి

చారకొండ: ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మర్రిపల్లి సర్పంచ్ నరేష్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని మర్రిపల్లిలో బుధవారం రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడారు. ఎమ్మెల్యే సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

కొల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం ఆయన కొల్లాపూర్ పట్టణంలోని 20వ వార్డులో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పక్కా గృహాలు లేనివారికి త్వరలోనే ఇళ్ల మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన చోట్ల డ్రెయినేజీలు, సీసీ రోడ్లు నిర్మించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఎన్‌ఆర్ చౌరస్తాలో జంక్షన్ నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు చంద్రశేఖరాచారి, నరేందర్‌రెడ్డి, కృష్ణమూర్తి, రమేష్‌యాదవ్, ఖాదర్‌పాష, అశోక్ తదితరులున్నారు.



వార్డు పర్యటనలో ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

పట్టణానికి చెందిన పలువురు యువకులు బుధవారం ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మరిన్ని చేరికలు ఉంటాయని ఎమ్మెల్యే వివరించారు.

పేదలపై భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వం

అచ్చంపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం పేదలపై భారం మోపుతుందని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం ఆయన ఫోన్‌లో మాట్లాడారు. దేశంలోని సామాన్య ప్రజల నడ్డి విరిచేలా వంట గ్యాస్ ధరలు పెంచి పేదలు బతకలేని పరిస్థితి కల్పించారన్నారు. కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. ప్రధాని మోదీ విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. వంటగ్యాస్ ధర రూ.50, వాణిజ్య సిలిండర్ ధరను ఏకంగా రూ.350 పెంచడం సిగ్గుచేటన్నారు. వంటగ్యాస్, నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచుతున్నారని భగ్గుమన్నారు. మోదీ ప్రభుత్వం దేశాన్ని నాశనం చేసి ఆదానీ, అంబానీకి దోచిపెడుతున్నారన్నారు. బీజేపీ శక్తుల నుంచి దేశాన్ని కాపాడటం కోసం సీఎం కేసీఆర్ ప్రత్యామ్నాయంగా బీఆర్ఎస్ పార్టీని స్థాపించారన్నారు. పెంచిన వంటగ్యాస్ ధరలను తగ్గించే వరకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కేంద్రం దిగివచ్చి పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు.

మోదీపాలనకు చరమగీతం పాడుదాం

కల్వకుర్తి: వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచి దేశంలోని 70 కోట్ల మంది మహిళల ఉసురు పోసుకుంటున్న నరేంద్రమోదీ పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాకముందు సిలిండర్ ధర రూ.450 ఉండగా.. ప్రస్తుతం రూ.1,155కు చేరిందన్నారు. పెంచిన సిలిండర్ ధరలు మధ్యతరగతి కుటుంబాలకు మోయలేని భారం అని అన్నారు. బీజేపీ రాక్షస పాలన నుంచి దేశానికి విముక్తి కలిగించేందుకు సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని, దేశ ప్రజలు కేసీఆర్ ప్రధాని కావాలని కోరుకుంటున్నారని అన్నారు.

జీవాలకు వేసవి జాగ్రత్తలు తీసుకోండి

బిజినేపల్లి: పశువులను సంరక్షించుకునే రైతులు వేసవిని దృష్టిలో పెట్టుకుని వాటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని, ఉదయం 12 గంటలలోపే పశువుల్ని చల్లటి నీడనిచ్చే ప్రదేశాలకు తరలించాలని జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డా.జి.వి.రమేష్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో సామూహిక నట్టల నివారణ కార్యక్రమానికి హాజరై పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. పశువులకు వేసవిలో మధ్యాహ్నం లోపే మేతలు పూర్తి చేయాలన్నారు.



నట్టల నివారణ మందుల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి డా.జి.వి.రమేష్

సర్పంచ్ లక్ష్మమ్మ, కవిత, ఎంపీటీసీ లక్ష్మమ్మ, వెంకటేష్, మల్లేష్‌గౌడ్, సిబ్బంది నరేష్‌రెడ్డి, నర్సింహ, ఫణీంధర్‌రెడ్డి, శ్రీనివాసులు, తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

వ్యాధులు రాకుండా జీవాలను రక్షించుకోవాలి

వెల్దండ: సీజనల్ వ్యాధుల నుంచి గొర్రెలు, మేకలను రక్షించుకోవాలని మండల పశువైద్య అధికారి శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని అజిలాపూర్, బైరాపూర్, లాలుతండా, కుందారంతండాలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న నట్టల నివారణ మందులను జీవాలకు ముందస్తుగా తాగించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలని పశువైద్యాధికారి డా.రాజేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఇంద్రకల్, పాపగల్ గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి



ప్రదర్శనలో హెల్త్ సెంటర్, బ్యాంక్ శాఖను ప్రదర్శించిన బాకారం పాఠశాల విద్యార్థులు

లింగాల: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడుతాయని జిల్లా సైన్స్ అధికారి(డీఎస్‌ఓ) కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్‌ఓ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఇలాంటి వేదికల ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించాలని డీఎస్‌ఓ కోరారు.

15 పాఠశాలల విద్యార్థులు

అంబట్‌పల్లిలో ఎస్వీకే ఆధ్వర్యంలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 15 పాఠశాలల విద్యార్థులు పలు రకాల ప్రయోగాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన రెండు పాఠశాలలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు, పాల్గొన్న ప్రతి పాఠశాలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. సర్పంచ్ రవిశంకర్, హన్మంత్‌రెడ్డి, నారాయణగౌడ్, జనార్దన్, శేఖర్, తాహెర్‌పాష పాల్గొన్నారు.

పంటల నమోదు చేపట్టాలి

తెలకపల్లి: ఏఈఓలు క్షేత్రస్థాయిలో పంటల నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మండల పరిధిలోని పర్వతాపూర్‌లో ఆయన పర్యటించి రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. రైతులు ఈ యాసంగిలో ఏయే పంటలు సాగుచేశారని, వాటిని పరిశీలించి కచ్చితంగా పంటను నమోదు చేయాలని సూచించారు. జిల్లాలోని ఏయే రైతులు ఏయే పొలాల్లో ఏయే పంటలు వేశారు మొక్కజొన్న, వేరుశనగ, వరితో పాటు ఇతర పంటలను సాగు చేశారని వాటిని గుర్తించి నమోదు చేయాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి, ఏఓ సందీప్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి బార్గవ్ సాగర్, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

తెలకపల్లి: అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని డీపీఓ కృష్ణ సూచించారు. మండల పరిధిలోని దాసుపల్లిలో స్వచ్ఛభారత్ గ్రామీణ పేస్ 2 మూడో రోజు శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యపరచాలన్నారు. మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, బహిర్భూమికి వెళ్లకుండా అరికట్టాలని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. డీఎల్‌పీఓ రామ్మోహన్‌రావు, శిక్షకుడు ఊశన్న, ఎంపీడీఓ చెన్నమ్మ పాల్గొన్నారు.

డీపీఓకు ఫిర్యాదు

బల్మూర్: మండలంలోని రామాజిపల్లిలో సర్వే నంబర్ 354లో అక్రమ నిర్మాణం కోసం గ్రామ కార్యదర్శి ఇచ్చిన అనుమతిని రద్దు చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ.. గ్రామానికి చెందిన ఏశగౌడ్ బుధవారం జిల్లా పంచాయతీ అధికారి కృష్ణయ్యకు ఫిర్యాదు చేశాడు.